క్లుప్తంగా

వైభవంగా వజ్రగణపతి ఆలయ వార్షికోత్సవం



స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 23వ డివిజన్ పరిధిలోని నందివాడ వారి వీధిలో కొలువైన వజ్ర గణపతి ఆలయం తొమ్మిదో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్, చందా సత్రం మాజీ చైర్మన్ వాకచర్ల కృష్ణ, సూర్యకుమారి దంపతులు, యతిరాజు సంపత్ కుమార్, రేణుక దంపతులు వజ్ర గణపతికి 18 రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పేరూరి మహేంద్రనాథ్, సరిదే ధన వెంకటేశ్వరరావు, మాడడుగుల సుబ్బయ్య, సోమిశెట్టి భీమేశ్వరరావు, కనమర్లపూడి చంద్రకాంత్, గొల్లపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పందన

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందని కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని కోరారు.

నేడు జగనన్న విద్యాకానుక ప్రారంభం

కంబాలచెరువు: స్థానిక కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక పంపిణీని సోమవారం ఎంపీ భరత్‌రామ్ ప్రారంభిస్తారని అర్బన్ స్కూల్స్ డీఐ బి.దిలీప్ కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ జగనన్న విద్యాకానుకను పాఠశాలలు తెరిచే రోజునే విద్యార్థులకు అందజేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. దానిలో భాగంగా మండల స్టాక్ పాయింట్ నుంచి కిట్లను మూడు రోజుల క్రితమే పాఠశాలలకు అందజేశామన్నారు.

ముగిసిన క్రీడా శిక్షణ శిబిరం

ప్రకాశం నగర్: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 35 రోజుల పాటు నిర్వహించిన చిన్నారుల వేసవి క్రీడా శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ముగింపు వేడుకలకు ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులకు ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం జిల్లా ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పిల్లలలో మానసిక ఉత్సాహాన్ని, పోటీ తత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ పంకజ్ కుమార్ మీనన్, అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) జి.వెంకటేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ(ఏఆర్) డి.శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ డి.రామవర్మ, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.రఘురాం పాల్గొన్నారు.

యాత్ర విజయవంతం కావాలని పూజలు

రాజమహేంద్రవరం రూరల్: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఈ నెల 14న ప్రారంభిస్తున్న వారాహియాత్ర విజయవంతం కావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం బొమ్మూరు గ్రామదేవత దోసాలమ్మతల్లి ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కందుల దుర్గేష్‌కు దోసాలమ్మతల్లి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి సత్కరించారు.

టీడీపీ సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: వచ్చే సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ గెలుపు తథ్యమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. తొర్రేడులోని జీఎస్ఎన్ కల్యాణ మండపంలో ఆదివారం టీడీపీ నాయకుడు కురుకూరి కిషోర్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, బూత్ ఇన్‌చార్జుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోరంట్ల మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీబలోపేతంపై దిశానిర్దేశం చేశారు. మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జులు గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ పాల్గొన్నారు.

గాడాల హెచ్‌ఎం జ్యోతికుమారికి సత్కారం



జ్యోతికుమారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీటీఐ ఉపాధ్యాయులు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల కాంప్లెక్స్ (పాఠశాలల సముదాయం)హెచ్ ఎం ఎస్ఎన్ జ్యోతికుమారిని పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల అసోసియేషన్ ఉపాధ్యాయులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జ్యోతికుమారి అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం పెద గెద్దాడ హైస్కూల్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల అసోసియేషన్ నాయకులు కలిశారు.

గాంధీ పార్కులో ఆధునిక హంగులు

- రూ. 2 కోట్లతో ప్రణాళికలు సిద్ధం
- త్వరలోనే పనులు ప్రారంభం



దానవాయిపేట నగర పాలక సంస్థ పార్కు ముఖ ద్వారం



పార్కులో ఏర్పాటు చేయనున్న ఆకృతి (ఊహాచిత్రం)

రాజమహేంద్రవరం సిటీ: దానవాయిపేట గాంధీ పార్కును అత్యాధునిక వసతులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. నగరంలో అత్యంత రద్దీగా ఉండే దానవాయిపేట ప్రాంతంలో సుమారు రెండెకరాల్లో ఈ పార్కు విస్తరించి ఉంది. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ పార్కుకు వందల మంది సందర్శకులు వస్తుంటారు. దగ్గరలోనే ప్రకాశం నగర్ రౌండ్ పార్కు ఉన్నప్పటికీ ఈ పార్కుకే సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుంది. ఆధునికంగా పార్కును అభివృద్ధి చేసి నగరంలో ప్రత్యేకంగా నిలపాలని అధికారులు, ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు.

నగరంలో 30 పార్కులు

నగరంలో సుమారు 30 పార్కులను నగర పాలక సంస్థ ఏర్పాటు చేసింది. వీటిల్లో ఇప్పటికే సందర్శకులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. వాకింగ్ ట్రాక్‌తో పాటు జిమ్ ఎక్విప్‌మెంట్ తదితర సదుపాయాలు కల్పించారు. దానవాయిపేట పార్కును అత్యాధునికంగా తీర్చిదిద్ది, దశల వారీగా మిగిలిన పార్కులను అభివృద్ధి చేసేందుకు నగర పాలక సంస్థ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఆధునికంగా..

దానవాయిపేట పార్కు ముఖద్వారంలో అందమైన ఆకృతి, లోపల పూర్తిస్థాయి లైటింగ్, వాటర్ ఫౌంటైన్, అత్యాధునిక గడియారం, పార్కులో సందర్శకులు కూర్చునే ప్రాంతాల్లో వివిధ ఆకృతులు, ప్రకృతి సిద్ధంగా కనిపించేలా ట్రీ సిట్టింగ్. పెవిలియన్ ఇన్‌స్టాలేషన్, కొంటర్ ల్యాండ్ స్కేపింగ్, పిల్లలు ఆడుకునేందుకు ప్లే ఏరియా, స్కేటింగ్ రింగ్, అంబరిల్లా ఇన్‌స్టాలేషన్, చిన్నపాటి సమావేశాలు ఏర్పాటుకు వేదిక తదితర వాటిని ఏర్పాటు చేయనున్నారు. త్వరలోనే ఇవి కార్యరూపం దాల్చనున్నాయి. సందర్శకులు, చిన్నారులకు కనువిందు చేయనున్నాయి.

అభినందనీయం



దానవాయిపేట పార్కును అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. నగర ప్రజలు సేదతీరేందుకు పార్కులు చాలా అవసరం. మాకు దగ్గరలోని పార్కు సర్వాంగ సుందరంగా తయారు చేయనుండడం అదృష్టంగా భావిస్తున్నాను.

– శిరీష, దానవాయిపేట,

మరింత సుందరంగా పార్కు



దానవాయిపేట పార్కు ఆధునీకరణ చర్యలు తీసుకోవడం బాగుంది. ఇక్కడ పలు రకాల ఆధునిక పరికరాలను ఏర్పాటు చేయనుండడం ఆనందంగా ఉంది. ఆధునీకరణ అనంతరం ఈ పార్కు మరింత సుందరంగా మారుతుంది.

– ప్రకాష్‌రాజ్, బీమా అధికారి, దానవాయిపేట

సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను కలిసిన ఎయిడెడ్ కళాశాలల అసోసియేషన్ సభ్యులు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వినతిపత్రం అందజేసిన పార్ట్‌టైం అధ్యాపకులు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలోని వివిధ ఎయిడెడ్ కళాశాలల్లో పని చేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ప్రకాశం నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడెడ్ కళాశాల పార్ట్‌టైం అధ్యాపకుల అసోసియేషన్ సభ్యులు కలిశారు. వివిధ కళాశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులను క్రమబద్ధీకరణ చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎయిడెడ్ కళాశాలల్లో 25 నుంచి 30 ఏళ్లగా పనిచేస్తున్నామన్నారు. సీనియారిటీ ప్రాతిపదికన ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గవర్నమెంట్ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరణ చేస్తున్నట్లు ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారమే తమ సేవలను గుర్తించి క్రమబద్ధీకరణ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఈ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించే విధంగా బాధ్యత తీసుకుంటానని హామీనిచ్చారు. ఎమ్మెల్యే రాజాను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు విల్లా రాజ్ కుమార్, సెక్రటరీ సంజీవరావు, జాయింట్ సెక్రటరీ విల్లా లక్ష్మి, డి.శ్రీనివాస్, కోశాధికారి సుందర రామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

మేరీమాత మందిరం ప్రారంభోత్సవం





ప్రారంభోత్సవంలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: మురమండ గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం నిర్మించిన మేరీమాత ఆలయం ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ ఆలయ నిర్మాణానికి ముఖ్యదాతలుగా వ్యవహరించిన మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత దుళ్ల గ్రామానికి చెందిన రైతు సత్తి భాస్కర్‌రెడ్డిని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన్ నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ప్రత్యేకంగా అభినందించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ పాల్గొన్నారు.

ఘనంగా నటరాజ రామకృష్ణ జయంతి



చిన్నారికి ప్రశంసాపత్రం అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి, చిత్రంలో ఆకుల వీర్రాజు

ప్రకాశం నగర్: పేరిణి శివతాండవం, ఆంధ్ర నాట్యం పునఃసృష్టి చేసిన నాట్యకళా పితామహుడు నటరాజ రామకృష్ణ శత జయంతి, తెలుగు భాష, చిత్రలేఖనం ఉచిత వేసవి శిక్షణ తరగతుల ముగింపు ఉత్సవాలను ఆదివారం స్థానిక సంహిత కన్వెన్షన్ హాల్లో నాట్య పండితుడు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ నటరాజ రామకృష్ణ పేరిణి, ఆంధ్ర నాట్యాన్ని పునఃసృష్టించడమే కాకుండా, అనేక గ్రంథాలు రచించారన్నారు. ఆయన శిష్యుడైన దుర్గాప్రసాద్ ఆలయ నృత్యం, యజ్ఞ నర్తనంతో పాటు, 25 గ్రంథాలు రచించారన్నారు. అనంతరం తెలుగు భాష, చిత్రలేఖనంలో శిక్షణ పొందిన 50 మంది చిన్నారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో పాటు పెద్ద బాలశిక్షను అందజేశారు. కార్యక్రమంలో ఆదిత్య కళాశాల డైరెక్టర్ గంగిరెడ్డి, డాక్టర్ పీవీబీ సంజీవరావు, పర్యావరణ మిత్ర పురస్కార గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు, తుమ్మిడి రామ్‌కుమార్, కృష్ణారెడ్డి, తుమ్మిడి విజయకుమార్ పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యం



దానవాయిపేట గ్రంథాలయంలో ప్రముఖులకు సత్కారం



కడియంలో ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ప్రకాశం నగర్: పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే వేసవి శిక్షణ తరగతుల లక్ష్యమని వక్తలు అన్నారు. స్థానిక దానవాయిపేట మహిళా గ్రంథాలయం, శాఖా గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. చివరి రోజు కార్యక్రమానికి న్యాయవాది పి.శ్రీనివాసరావు, లైబ్రేరియన్ అబ్బిరెడ్డి చంద్ర పద్మాదేవి, పి.పవన్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు ముంగండి సూర్యనారాయణ, పిచ్చుక రాంబాబు, పోతుకూచి కృష్ణమోహన్, ఇజ్జిన వినోద్ కుమార్, ఎస్.జ్యోతిని ఘనంగా సత్కరించారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు, పుస్తకాలు బహుమతులుగా అందజేశారు.

కడియంలో..

కడియం: కడియం శాఖా గ్రంథాలయంలో గతనెల 8న ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. గ్రంథాలయాధికారి శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలం విద్యాశాఖాధికారి లజపతిరాయ్ పాల్గొన్నారు. 35 రోజుల పాటు నేర్పిన వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, జనరల్ నాలెడ్జి పుస్తకాలు, వాటర్ బాటిళ్లు అంజదేశారు. ప్రముఖ న్యాయవాది తోరాటి వసంత రావు, దేవరపు నీలకంఠం మాస్టారు, ఉపాధ్యాయుడు చిలుకూరు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. బొమ్మూరులోని టిడ్కో గృహాల సముదాయంలో సి బ్లాక్ కమిటీ, ప్రేయర్ హౌస్ చర్చి పాస్టర్ కదలి జోసఫ్‌రాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం పర్యవేక్షణలో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కిమ్స్ హాస్పటల్ వైద్యబృందం రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలందరూ కార్పొరేట్ వైద్యసేవలు పొందుతున్నారన్నారు. టిడ్కో సముదాయంలో ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చందన నాగేశ్వర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం అధ్యక్షుడు వీవీ కృష్ణారావు, ప్రచార కమిటీ అధ్యక్షుడు పెదిరెడ్ల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకుడు మత్సేటి శివ, సి బ్లాక్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చెత్త సమస్యకు పరిష్కారం

- ముందుకు వచ్చిన హార్లిక్స్ యాజమాన్యం
- ఏడు వాహనాల అందజేత



చెత్త సేకరణకు హార్లిక్స్ యాజమాన్యం సమకూర్చిన వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత (ఫైల్)

ధవళేశ్వరం: పారిశుధ్య సమస్యకు పరిష్కారం లభించింది. ధవళేశ్వరం, రాజవోలు గ్రామాలలో చెత్త సేకరణకు సీఎస్ఆర్ నిధుల ద్వారా హార్లిక్స్ ఫ్యాక్టరీ (హిందూస్థాన్ యూనీలివర్) యాజమాన్యం ముందుకు వచ్చింది. కాలుష్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ఇటీవల హార్లిక్స్ యాజమాన్యం ధవళేశ్వరం, రాజవోలు గ్రామాలను దత్తత తీసుకుంది. ఇందులో భాగంగా 7 నూతన వాహనాలను సమకూర్చింది. వీటిని ఇటీవల కలెక్టర్ కె.మాధవీలత ప్రారంభించారు. ఇందులో 5 వాహనాలను ధవళేశ్వరం గ్రామానికి, 2 వాహనాలను రాజవోలు గ్రామానికి కేటాయించారు. వీటి ద్వారా గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తను సేకరిస్తారు.

ఫలించిన చందన నాగేశ్వర్ కృషి

ధవళేశ్వరంలో ప్రధానంగా పారిశుధ్య సమస్య వేధిస్తోంది. సుమారు 13 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న గ్రామంలో పారిశుధ్య నిర్వహణ కష్టమవుతోంది. ప్రధానంగా రోడ్లపైనే చెత్త వేయడం, డ్రైనేజీలలో చెత్తతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను వేస్తుండటంతో తరచూ డ్రైనేజీలలో పూడికలు పెరిగి రోడ్లపై మురుగునీరు పారే పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామంలో పారిశుధ్య సమస్య పరిష్కారానికి వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ప్రత్యేక దృష్టి సారించారు. అధికారులతో పలుసార్లు సమావేశమై పారిశుధ్య నిర్వహణను గాడిలో పెట్టేందుకు పలు సూచనలు చేశారు. చందన నాగేశ్వర్, కలెక్టర్ మాధవీలత ప్రత్యేక చొరవతో హార్లిక్స్ యాజమాన్యం ధవళేశ్వరం, రాజవోలు గ్రామాల్లో తడి, పొడిచెత్త సేకరణ ముందుకు వచ్చింది. ధవళేశ్వరంలో తడి, పొడి చెత్తను సేకరించేందుకు హార్లిక్స్ యాజమాన్యం ఐదు వాహనాలను కేటాయించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే మేజర్ పంచాయితీ అయిన ధవళేశ్వరం 13 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. గ్రామంలో 20 వార్డులు ఉన్నాయి. చెత్త సేకరణకు కనీసం మరో 15 వాహనాలను సమకూరిస్తే వార్డుకు ఒక్కో వాహనం ఉంటుంది.

మరిన్ని వాహనాలు అవసరం



గ్రామంలో చెత్త సేకరణకు సీఎస్ఆర్ నిధులు ద్వారా 5 వాహనాలు కేటాయించడంతో పారిశుధ్య సమస్యలు కొంతమేర గట్టెక్కుతాయి. వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, జిల్లా కలెక్టర్ మాధవీలత కృషి ఫలితంగా ధవళేశ్వరంలో చెత్తసేకరణకు హార్లిక్స్ యాజమాన్యం ముందుకువచ్చింది. మరిన్ని వాహనాలను సమకూరిస్తే సమస్య పూర్తిస్థాయిలో గట్టెక్కుతుంది.

డి.సూరిబాబు, పంచాయతీ కార్యదర్శి, ధవళేశ్వరం

వాలీబాల్ విజేత సీతానగరం

బిక్కవోలు: ఊలపల్లి గ్రామంలోని స్వర్గీయ శ్రీ మార్ని వెంకన్న చౌదరి మెమోరియల్ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో సీతానగరం జట్టు విజేతగా నిలిచింది. గత రెండు రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో 8 ఎనిమిది జట్లు తలపడ్డాయి. ఈ పోటీలో ఫైనల్‌లో ఊలపల్లి, సీతానగరం జట్లు పోటీ పడగా వారిలో విజేత సీతానగరం, రన్నర్‌గా ఊలపల్లి నిలిచాయి. అనంతరం గెలిపొందిన వారి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలోని గ్రామ ఎంపీటీసీ బండారు శివ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గోకవరం: మండలంలోని కామరాజుపేటలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...కామరాజుపేట గ్రామానికి చెందిన బలిరెడ్డి వెంకటరమణ (40)ను ఆదివారం తెల్లవారుజామున ఎల్లం చెరువు దగ్గరలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. దీనిపై ఏఎస్‌ఐ రాంబాబునాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం

బిక్కవోలు: తోస్సిపూడిలో రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆలయం వద్ద తృతీయ వార్షికోత్సవం సందర్భంగా కల్యాణం నిర్వహించారు. అర్చకులు రామచంద్రప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన నల్లమిల్లి మణిధర్‌రెడ్డి, భాగలక్ష్మి దంపతులు పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం అన్నసమారధన చేశారు. విశేషంగా భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణమూర్తి ఆలయంలో ఆదివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని, వ్రతాలు ఆచరించారు.

మాజీ ఎంపీ హర్షకుమార్ తనయుడి అరెస్టు

మధురపూడి: మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తనయుడు జీవీ శ్రీరాజ్‌ను ఆదివారం కోరుకొండ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామంలో జరిగిన అంబేడ్కర్ విగ్రహం వివాదం విషయమై శ్రీరాజ్ వెళ్లి, అక్కడి ప్రజలను రెచ్చగొట్టాడు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి వాతావరణాన్ని చల్లార్చారు. ఈ సందర్భంగా శ్రీరాజ్‌ను అదుపులోకి తీసుకుని, స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

సినిమాలు



శ్యామల	: అహింస
సూర్యమినీ	: విమానం
సూర్యప్యాలెస్	: ట్రాన్స్‌ఫార్మర్స్
స్వామి	: బిచ్చగాడు–2
శివజ్యోతి	: ఇంటింటి రామాయణం
అనుశ్రీ	: ట్రాన్స్‌ఫార్మర్స్
రాజా	: ట్రాన్స్‌ఫార్మర్స్
అశోక	: టక్కర్
ఊర్వశి	: అన్‌స్టాబుల్
రంభ	: విమానం
మేనక	: యూనివర్సిటీ
అప్సర	: 2018
నామవరం	
వీఎస్ మహల్	: ట్రాన్స్‌ఫార్మర్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: టక్కర్
కడియం	
వెంకటసూర్య	: టక్కర్